# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం 24 నవంబర్ 2025 పేజీలు 8


సర్వే నెం.170/3 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు..



# మేడమ్ జైలుకు వెళ్ళినా..?

# బినామీలతో "ప్లాన్ బి"..?

## మల్లంపేట్ సర్వే నెం.170/3 ప్రభుత్వ భూమిలో..యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..

- తప్పుడు అనుమతులు రద్దుచేసి.! అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్న మున్సిపల్..
- 170/3 ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల నియంత్రణలో రెవెన్యూ విఫలం..
- కబ్జాల నియంత్రణకి "జిపివో"ల నియామకం..! ఫెయిల్ అయినట్టేనా..?
- ఆదివారం కూడా ఫిర్యాదులేనా..!దుండిగల్ మున్సిపల్ అధికారి సమాధానం..
- వర్కింగ్-డే ఉన్నా..! మున్సిపల్ చేసేదేమీ లేకపోయినా.. డైలాగ్‌లకు కొదవలేదు..
- పర్మిషన్ రద్దుచేసినా..! నిర్మాణాలు చేపడుతుంటే చోద్యం చూస్తున్న మున్సిపల్..!
- గుర్రం విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్ పేరుతో ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు..

-2లో

"రెవెన్యూ-మున్సిపల్" అధికారులు అక్రమ నిర్మాణాల నియంత్రణలో విఫలం అవుతున్నారు.. "జిపివో"(విఆర్వో)ల నియామకం ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసమే అంటూ రెవెన్యూ చెబుతున్నప్పటికీ ఆచరణలో విఫలం అవుతున్నారు..! ఇటు టిజి-బిపాస్ చట్టం అమలులోనూ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.. మరోవైపు అధికారుల అండతోనే..! అక్రమ నిర్మాణ దారులు, మరింత రెచ్చిపోతున్నారు..! ఏమైనా అంటే అంటారు కానీ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, రెవెన్యూ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా..? బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో క్రయవిక్రయాలతో అక్రమ కట్టడాలు చేపట్టే కబ్జాలు ఆర్ఐ కనుసన్నల్లోనే..! టిజి-బిపాస్ ఇన్‌స్టాంట్ అనుమతుల పేరుతో అక్రమ అనుమతులు మంజూరు.. స్థానికుల ఫిర్యాదుతో మూడు పర్మిషన్‌ల దరఖాస్తును తిరస్కరించిన మున్సిపల్..! ఇప్పుడు పనులు చేస్తుంటే టౌన్‌ప్లానింగ్ పరధ్యానంలో ఉన్నారా..? శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థ కొనుగోలు చేసింది ఎంత..? ఆక్రమణలో ఉన్నదెంత..? కొన్నది 14-20 ఎ..! చెరువు శిఖం 2-20 ఎ.. ఆక్రమించినది 19-10 ఎ..! సర్వే నెం.170/3లో కొన్నది 5-00 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసింది 07-20 ఎకరాలు. "వినాయక రియల్టర్ అండ్ డెవలపర్స్ పేరుతో, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు.. గతేడాది సర్వే చేసిన రెవెన్యూ అధికారులు, కబ్జాచేసిన స్థలాన్ని స్వాధీన పరుచుకోలేదు ఎందుకు..? ముడుపులు ముట్టాయా..? ఆతర్వాత లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ యజమాని బిల్డర్ గుర్రం విజయలక్ష్మీ అరెస్ట్.. కత్వ చెరువులో 15 విల్లాలను కూల్చేసిన హైడ్రా అధికారులు..

రూటు మార్చిన విజయలక్ష్మీ..? బినామీలతో "ప్లాన్-బి" అమలు చేస్తోంది..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 23:**



అనుమతులు రద్దుచేసినా యధేచ్ఛగా పనుల అభివృద్ధి..

# టిమ్స్ ఆసుపత్రులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

**హైదరాబాద్ పెన్ పవర్:**నెల రోజుల్లో టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రిని ప్రారంభిస్తామని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా సీఎం ప్రకటించి నెల దాటినా ఇప్పటికీ అతీగతీ లేదని, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాల పట్ల ప్రచార ఆర్భాటాలు తప్ప పురోగతి కనిపించడం లేదని భారాస మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులను ఎప్పుడు ప్రారంభిస్తారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. "ప్రభుత్వ భూములను అమ్ముకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు వైద్యసేవలు అందించడంపై లేదు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే గానీ, ఆచరణ గడప దాడడం లేదనడానికి టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణమే నిదర్శనం. భారాస హయాంలో శరవేగంగా జరిగిన టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు.. కాంగ్రెస్ రాగానే నత్తనడకన సాగుతున్నాయి. ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయితే ఎక్కడ కేసీఆర్‌కు పేరొస్తుందో అనే ఆలోచనలతో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే వాటి పనులను పూర్తి చేయడం లేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.



# వితంతువులను దూరం పెట్టడం దురాచారం

## మూఢనమ్మకాలు వద్దన్న మంత్రి జూపల్లి

హైదరాబాద్ పెన్ పవర్: శుభకార్యక్రమాల్లో వితంతువులను దూరం పెట్టడం సాంఘిక దురాచారమని, మూఢనమ్మకాలను అనుసరించవద్దని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

-2 లో



# మేడమ్ జైలుకు వెళ్ళినా..? బినామీలతో "ప్లాన్-బి"..?









లక్ష్మీ శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్‌లో అక్రమ నిర్మాణాలు

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం మల్లంపేట్ గ్రామ సర్వే నెం.170/3 సబ్ డివిజన్‌తో కూడిన ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన భూమి కంటే అదనంగా "7-20" ఎకరాలు కబ్జాకు గురైనట్లు సర్వేలో తేలినప్పటికీ..! సంబంధిత ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకోవడానికి, రెవెన్యూ యంత్రాంగం శోచాయించడం, పలు అనుమానాలకు తావిస్తోంది.. గతనెల (అక్టోబర్) అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే..! రెవెన్యూ చోద్యం చూడటం..! మున్సిపల్ అధికారులు అక్రమార్కులకు సహకరించే ధోరణితో.. చర్యలు తీసుకున్నట్టు డ్రామా షురూ చేశారు.. అదే సమయంలో స్థానికుల ఫిర్యాదులు అందడంతో, మున్సిపల్ సిబ్బంది ఒక జేసిబితో వెళ్ళి నాలుగు గుంతలు పూడ్చేసి చేతులు దులుపుకున్నారు. "రెవెన్యూ-మున్సిపల్" అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ యజమాని విజయలక్ష్మికి చెందిన అక్రమ విల్లాల బాగోతం అందరికి తెలిసిందే..! 2021లో అనుమతుల ఫోర్జరీపై, కలెక్టర్ ఆదేశాలతో డిపిఓ విచారణతో నిర్ధారించారు.. 2023 అక్టోబర్ 3న హైకోర్టు ఆదేశానుసారం 208 విల్లాలకు ఎలాంటి వసతులు కల్పించకుండా, రిజిస్ట్రేషన్‌లు చేయకుండా నిషేధిత జాబితాకు, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీచేశారు.. గతేడాది క్రితం విజయలక్ష్మిపై దుండిగల్ పియస్‌లో కేసునమోదు, అరెస్ట్ చకచక జరిగిపోయాయి.. కత్వ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ స్థలం కబ్జాలో ఉన్న 15 అక్రమ విల్లాలను, తక్షణ చర్యల్లో భాగంగా, హైడ్రా అధికారులు నేలమట్టం చేసింది కూడా తెలిసిందే..!

ఒకప్పుడు విజయలక్ష్మి కన్‌స్ట్రక్షన్‌లో, ముఖ్యమైన వ్యక్తులు, ఆమె అరెస్ట్ అనంతరం, తన మనుషులతో "ప్లాన్-బి" అమలు చేస్తుందని గుసగుస..?

## విజయలక్ష్మి బినామీలతో..! "ప్లాన్-బి"..?

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లో లక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌లో అక్రమార్కుల "ప్లాన్-బి" మొదలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. టిజి-బిపాస్ ఇన్‌స్టాంట్ అనుమతుల పేరుతో "శ్రీ వినాయక రియల్టర్ డేవలప్పర్స్" చేపడుతున్న అక్రమ నిర్మాణాలు, సర్వే నెంబర్ 170/3లో విజయలక్ష్మి కొనుగోలు చేసిన స్థలమేనని, ఆమే అరెస్ట్ అనంతరం..! "ప్లాన్-బి" ప్రకారం ముందుకు వెళ్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ అక్రమ కట్టడాలపై, నెల క్రితం స్థానికులతో కలిసి ఆకుల సతీష్ మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు. చేయడంతో..! మున్సిపల్ అధికారులు అక్రమంగా తవ్విన ఫుటింగ్ గుంతలను పూడ్చేశారు.. ఇదంతా అధికారుల మేనేజ్‌మెంట్‌లో భాగమే అంటూ విమర్శలు వస్తున్నాయి.. గుర్రం విజయలక్ష్మి తన "ప్లాన్-బి" అమలు చేసి, బినామీల పేరుతో అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## వితంతువులను దూరం పెట్టడం దురాచారం

- మొదటి పేజి తరువాయి


ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మాచినేనిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు రాముడు ఇంటి భూమిపూజకు మంత్రి హాజరయ్యారు. రాముడు భార్య గర్భిణి కావడంతో ఆయన తల్లి లక్ష్మీదేవమ్మ కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్లగా... ఆమె వితంతువు గనుక వద్దని గ్రామస్థులు వారించడంతో మంత్రి పైవిధంగా వ్యాఖ్యానించారు. లక్ష్మీదేవమ్మతోనే టెంకాయ కొట్టించి పూజ చేయించారు. 'వితంతువు కొబ్బరికాయ కొడితే ఇల్లు కూలిపోతుందా..? ఇలాంటి సాంఘిక దురాచారాలను కొనసాగించడం మంచిది కాదు' అని హితవు పలికారు. భర్తను కోల్పోయి మానసికవేదనకు గురవుతున్న మహిళలను శుభకార్యాలకు దూరంగా ఉంచడం, నోములు, వ్రతాలకు పిలవకుండా బహిష్కరించడం అమానవీయమన్నారు.

## చలకుర్తి చిన్నారుల ఖాతాలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్

**హైదరాబాద్ పెన్ పవర్ నవంబర్ 23:**నగరం లోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియం లో నిర్వహించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు పాల్గొని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడంలో నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన సంతోష్ కుమార్, ప్రియాంక ల కుమార్తె పాతనబోయిన సుదీక్ష , కుమారుడు పాతనబోయిన విహాస్ భాగస్వామ్యులు అయ్యారు. ఇట్టి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు తెలంగాణ కు చెందిన పలువురు మార్షల్ ఆర్ట్స్ కరాటే , టెక్వాండో , కుంగ్ ఫూ క్రీడాకారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా చిన్నారులు మాట్లాడుతూ ఇట్టి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందని, ఇట్టి రికార్డ్ తమపై మరింత బాధ్యత కూడా పెంచిందని మునుముందు మరింత కఠోరశ్రమతో సాధన చేసి మరెన్నో రికార్డులు సాధించి తల్లితండ్రులకు, పుట్టిన ఊరికి, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకువస్తామని , చిన్ననాటి నుండే శిక్షణ ఇప్పించి నిరంతరం తమవెంట ఉండి నడిపిస్తున్న తల్లితండ్రులకు, శిక్షణలో మెళకువలు నేర్పించి మంచి మంచి అవకాశాలు ఏర్పాటు చేసిన కోచ్ మహేష్ నాయక్ మాస్టర్ , శివ మాస్టర్ , ఆర్.మహేష్ మాస్టర్ లకు ధన్యవాదాలు తెలియచేశారు.



# తెలంగాణ రైజింగ్ సమ్మిట్.. ఫ్యూచర్ సిటీపై రేవంత్ ఆశలు




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపట్లో ఫ్యూచర్ సిటీని సందర్శించనున్నారు. వచ్చే నెల 8,9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షించనున్నారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచలను అధికారులకు చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల సందర్భంగా భారీగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల జరిగిన పార్ట్ నర్ షిప్ సమ్మిట్ కు భారీ స్పందన వచ్చింది. అక్కడ పదమూడున్నర లక్షల కోట్ల రూపాయల మేరకు ఒప్పందాలు జరిగాయి.

**పెట్టుబడులు అధికంగా...**

ఇప్పుడు తెలంగాణలో జరిగే రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు అంతకు మించి పెట్టుబడులు రావాలని ప్రభుత్వం భావిస్తుంది. అందులోనూ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావవస్తుండటంతో గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతం గా పూర్తి చేసి ఇతర రాష్ట్రాలకు దీటుగా నిలబడాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అలాగే రెండేళ్ల తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి తో పాటు ప్రజా ప్రభుత్వంగా తాము తీసుకున్న నిర్ణయాలను ఈ సమ్మిట్ ద్వారా ప్రజలకు చేరవేయాలని నిర్ణయించారు. దీనివల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కొంత అడ్వాంటేజీ అవుతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటూ పారిశ్రామిక విధానాలను కూడా ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి తెలియజెప్పాలన్న ఉద్దేశ్యంలో ఉన్నారు.

**విజన్ డాక్యుమెంట్ ను ...**

అలాగే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ ను కూడా ఆవిష్కరించనున్నారు. తమ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానంతో పాటు పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ఇక్కడి నుంచి వివరించనున్నారు. అందులోనూ మరో నగరాన్ని ఈ వేదిక ద్వారా తీసుకెళ్లే ప్రయత్నమూ రేవంత్ చేస్తున్నారు. భారత్ ఫ్యూ చర్ సిటీ పేరిట తమ ఆలోచనలను ఈ వేదిక నుంచి రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లో దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లోని అన్ని స్టార్ హెూటల్స్ లో రూమ్ లను వారి కోసం ముందస్తుగా బుక్ చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు తమ ఫ్యూచర్ ప్లాన్ ను వివరించి తెలంగాణకు అదనపు సొబగులు అద్దాలన్న ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు.

# ఐబొమ్మ రవికి ఇంత మద్దతు సోషల్ మీడియాలో ఎందుకో అర్థమయిందా?




**హైదరాబాద్ పెన్ పవర్:**ఐబొమ్మ ఇమ్మడి రవిపై సోషల్ మీడియాలో మద్దతు రావడానికి కారణాలపై టాలీవుడ్ పెద్దలు ఆలోచించాలి. గతంలో ఎన్నడు లేని విధంగా సోషల్ మీడియాలో ఐ బొమ్మ రవిని రాబిన్ హుడ్ తో పోలుస్తూ అనేక మంది పోస్టులు పెడుతున్నారు. చట్టపరంగా రవి చేస్తున్నది తప్పే. కానీ అదే సమయంలో వందల రూపాయలు టిక్కెట్ పెట్టి సినిమా చూడలేని వారికి ఐ బొమ్మ ఒక వరంగా మారిందన్నది వారి మాటల్లో కనపడుతుంది. కొత్త సినిమాలు అందులోనూ ప్రముఖ హీరోలు విడుదలయిన మూవీలు తొలి రోజు చూడాలని అభిమానులు కోరుకుంటారు. కానీ ఆర్థిక పరిస్థితి చాలా మందికి సహకరించదు. వందల రూపాయల టిక్కెట్లు పెట్టి కొనుగోలు చేయడం సాధ్యం కాకపోవడంతో తన అభిమాన హీరోను ఐ బొమ్మలో చూసుకుని కేరింతలు కొట్టడానికి అలవాటు పడ్డారు.

**అప్పుడే చిత్ర పరిశ్రమకు...**

అలాగని ఇమ్మడి రవిని చేసిన పనిని ఎవరూ సమర్థించడానికి వీలులేదు. చిత్ర పరిశ్రమకు గండి పడుతుంటే లక్షలాది మంది కార్మికులు నష్టపోతారు. ఆ కోణంలో కూడా ఆలోచించాల్సి ఉంటుంది. అలాగే నిర్మాతలు, దర్శకులు, అగ్రహీరోలు కూడా నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకుని చిత్రాన్ని ప్రేక్షకులకు అందుబాటులోకి తెస్తే ఈ గొడవంతా ఉండదు. అప్పుడు అందరూ బిగ్ స్క్రీన్ లోనే చూడాలనుకుంటారు. సినిమా ఇప్పుడూ.. ఎప్పుడూ వినోదంగానే చూడాలి. వ్యాపారంగా మారితే అది అందరికీ ప్రమాదం. ఇది టాలీవుడ్ పెద్దలు కూడా ఆలోచించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఇమ్మడి రవిని సమర్థించే వారిని పక్కన పెట్టి తాము చిత్ర పరిశ్రమ నిలదొక్కుకోవడానికి ఏం చేయాలన్నది ఆలోచిస్తే మంచిదన్న విశ్లేషణలు వినపడుతున్నాయి.

**నిర్మాతలు.. దర్శకులు...**


ముందుగా నిర్మాతలు, దర్శకులు కూడా ఆలోచన చేయాలన్న కామెంట్స్ ఎక్కువగా వినపడుతున్నాయి. తక్కువ బడ్జెట్ తో విడుదలయి ఇటీవల అనేక సినిమాలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. అదే సమయంలో వీఎఫ్ఎక్స్ గ్రాఫిక్స్, అత్యధిక పారితోషికాలు, ప్రీ రిలీజ్ ఈవెంట్స్, చివరకు సినిమా పేరు రివీల్ చేయడానికి కూడా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆ మొత్తాన్ని టిక్కెట్ల రూపంలో రాబట్టుకోవడం అంటే ఎలా? అని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అందుకే ఐ బొమ్మ రవికి ఎక్కువగా నేటి యువత అండగా నిలబడుతుంది. అతను తప్పు చేయవచ్చు కానీ, తమకు అందని వినోదాన్ని ఏ మాత్రం ఖర్చు లేకుండా చూపిస్తున్నాడని, అతను నేరం చేశాడని ఎలా అంటామని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.

## భూ వివాదం..అక్క కుటుంబాన్ని.. ట్రాక్టర్ తో తొక్కించేందుకు యత్నించిన తమ్ముడు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆస్తులు, డబ్బులకు మానవ సంబంధాలే కాదు...రక్త సంబంధాలు కూడా మంటగలిసిపోతున్నాయి. జీవితాంతం అక్కకు రక్షణకు ఉండాల్సిన ఓ తమ్ముడు భూ వివాదం కారణంగా అక్క కుటుంబంపైనే దాడి చేశాడు.సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో దారుణం జరిగింది. గ్రామానికి చెందిన ఉపేందర్ రెడ్డి తన సోదరితో గత కొంతకాలంగా భూ వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో సోదరి వరి కోతను ప్రారంభించగా తమ్ముడు ఉపేందర్ రెడ్డి విచక్షణ రహితంగా ప్రవర్తించాడు. తన సోదరితో పాటు ఇద్దరు మేనకోడళ్లను, డ్రైవర్ పై ట్రాక్టర్ తో తొక్కించి చంపేందుకు ప్రయత్నించాడు. దీనికి సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనలో బాధితులు ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. తమకు రక్షణ కల్పించాలని బాధితులు పోలీసులను కోరారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యాయత్నం చేసిన ఉపేందర్ రెడ్డి కోసం గాలిస్తున్నారు పోలీసులు.

# తెలంగాణ మంత్రుల వాట్సప్ మీడియా గ్రూపులు హ్యాక్




**హైదరాబాద్ పెన్ పవర్:** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఎమ్మెల్యేలు,మంత్రులు ఇలా ఏ ఒక్కరి ఫోన్లు వదలడం లేదు. లేటెస్ట్ గా పలువురు తెలంగాణ మంత్రుల వాట్సాప్ మీడియా గ్రూప్ లతో పాటు పలువురి వాట్సాప్ లు సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఎస్బీఐ బ్యాంక్ ఆధార్ అప్డేట్ పేరుతో ప్రమాదకర ఏపీకే ఫైల్స్ ను షేర్ చేస్తున్నారు. ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచిస్తు ఎస్బీఐ పేరుతో మెస్సేజ్ లు చేస్తున్నారు. ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.సైబర్ మోసగాళ్లు రూట్ మార్చారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరిగి ఓటీపీలు చెప్పకుండా జాగ్రత్త పడుతుండటంతో ఏకంగా మొబైల్ ఫోన్లనే హ్యాక్ చేస్తున్నారు. ఇందుకోసం ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఫైళ్ల రూపంలో మాల్‌వేర్‌ను పంపి సెల్‌ఫోన్లలోకి చొరబడుతున్నారు. ఆ తరువాత మొబైల్ ఫోన్‌ను తమ అధీనంలోకి తీసుకుని బ్యాంక్ అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు

**ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయొద్దు..**


సోషల్ మీడియాలో వచ్చే ఏపీకే ఫైల్ లింకులను ఎట్టి పరిస్థితిలోనూ క్లిక్ చేయొద్దు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి మాత్రమే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్లే స్టోర్ లోనూ కొన్ని యాప్ లు స్కామర్లు సృష్టించినవి ఉంటాయి. స్మార్ట్ ఫోన్‌లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్(తెలియని వెబ్ సైట్ల నుంచి) అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. దీంతో మన అనుమతి లేకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కావు. ఏపీకే ఫైల్, మాల్‌వేర్ ఇన్‌స్టాల్ జరిగినట్లు అనుమానం వస్తే మొబైల్ రీసెట్ చేయాలి. ఆ వెంటనే బ్యాంక్ అకౌంట్‌కు సంబంధించిన పిన్ నంబర్లు, పాస్‌వర్డులు మార్చుకోవాలి. M KAVACH2 యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని స్కాన్ చేస్తే మొబైల్ డివైజ్ సెక్యూర్‌గా ఉంటుంది.

**వెంటనే 1930కి కాల్ చేయాలి..**

ఏపీకే ఫైళ్లతో పాటు సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే లింకులు ఓపెన్ చేస్తే.. ఫోన్ హ్యాకర్ల చేతిలోకి వెళ్తుంది. ఏపీకే వంటి యాప్?లను ఇన్ స్టాల్ చేస్తే.. ఓటీపీలు చెప్పకున్నా అకౌంట్లు ఖాళీ చేస్తారు. సైబర్ క్రిమినల్స్ బారిన పడిన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి. లేదా http://cybercrime.gov.in ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు.

# కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఎంత నీరు తాగాలి...?

- కిడ్నీల ఆరోగ్యానికి నీరు అత్యంత కీలకం
- డీహైడ్రేషన్ వల్ల కిడ్నీలపై తీవ్రమైన ఒత్తిడి
- అతిగా నీరు తాగినా ఆరోగ్యానికి ప్రమాదమే
- పురుషులకు 3.7, మహిళలకు 2.7 లీటర్ల ద్రవాలు అవసరం
- శరీర సంకేతాలను గమనిస్తూ నీరు తాగడం ముఖ్యం



**హైదరాబాద్ పెన్ పవర్:**మన శరీరంలో కిడ్నీలు చేసే పని చాలా కీలకమైనది. రక్తాన్ని శుద్ధి చేయడం, వ్యర్థాలను బయటకు పంపడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ ప్రక్రియ సజావుగా సాగాలంటే తగినంత నీరు తాగడం తప్పనిసరి. అయితే నీరు తక్కువైనా, మరీ ఎక్కువైనా కిడ్నీలకు ప్రమాదమేనని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటిని సమతుల్యంగా తీసుకోవడం ద్వారానే కిడ్నీలను ఆరోగ్యంగా కాపాడుకోగలం.

**రోజుకు ఎంత నీరు తాగాలి?**

సాధారణంగా ఒక వ్యక్తి రోజుకు ఎన్ని నీళ్లు తాగాలనేదానిపై కచ్చితమైన లెక్క లేదు. అమెరికా నేషనల్ అకాడమీస్ ఆఫ్ సైన్సెస్ ప్రకారం, పురుషులు రోజుకు సగటున 3.7 లీటర్లు, మహిళలు 2.7 లీటర్ల వరకు ద్రవాలు తీసుకోవాలి. ఇందులో మనం తాగే నీటితో పాటు, పండ్ల రసాలు, ఇతర పానీయాలు, ఆహారం ద్వారా లభించే ద్రవాలు కూడా కలిసి ఉంటాయి. అయితే, వయసు, వాతావరణం, చేసే వ్యాయామం, ఆరోగ్య పరిస్థితిని బట్టి ఈ మోతాదు మారుతుంది. వేసవిలో, గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఎక్కువ నీరు తాగాల్సి ఉంటుంది.

**డీహైడ్రేషన్, ఓవర్ హైడ్రేషన్ ప్రమాదాలు**

శరీరానికి అవసరమైన నీరు అందకపోతే డీహైడ్రేషన్ బారిన పడతాం. దీనివల్ల మూత్రం తక్కువగా రావడం, నోరు ఆరిపోవడం, తలనొప్పి, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీర్ఘకాలిక డీహైడ్రేషన్ కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి, కిడ్నీల పనితీరు మందగించడానికి కారణమవుతుంది. మూత్రం రంగు ముదురు పసుపు రంగులో ఉంటే డీహైడ్రేషన్‌కు సంకేతంగా భావించాలి.

అదే సమయంలో, నీళ్లు ఎంత తాగితే అంత మంచిది అనుకోవడం కూడా పొరపాటే. అతి తక్కువ సమయంలో ఎక్కువ నీరు తాగడం వల్ల 'ఓవర్ హైడ్రేషన్' లేదా 'హైపోనాట్రీమియా' అనే సమస్య తలెత్తవచ్చు. ఇది రక్తంలో సోడియం స్థాయిలను తగ్గించి, కిడ్నీలు, మెదడుపై తీవ్ర ఒత్తిడి పెంచుతుంది.

**కిడ్నీలను కాపాడుకోవడానికి చిట్కాలు**

కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కొన్ని సూచనలు పాటించడం మేలు. నీటిశాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కీరదోస వంటి పండ్లు, కూరగాయలు తినాలి. చక్కెర, కెఫిన్ ఉన్న పానీయాలకు దూరంగా ఉండాలి. మధుమేహం, గుండె జబ్బులు ఉన్నవారు నీటిని ఎంత మోతాదులో తీసుకోవాలో వైద్యులను సంప్రదించాలి. మొత్తం మీద, శరీరం చెప్పే సంకేతాలను గమనిస్తూ, దాహానికి అనుగుణంగా నీరు తాగడం ద్వారా కిడ్నీలను ఆరోగ్యంగా కాపాడుకోవచ్చు.

## జూబ్లీహిల్స్ రహమత్ నగర్లో పేలిన సిలిండర్..మహిళ మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని రహమత్ నగర్లో సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో సోను సింగ్( 36) అనే మహిళకు తీవ్ర గాయాలై మృతి చెందింది. మరో వ్యక్తి గోపాల్ సింగ్ కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే స్థానిక ప్రవేట్ హాస్పిటల్ కి తరలించారు. ఘటనా స్థలానికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. మృతి చెందిన సోను మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మధురా నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్ పేలిన ఘటనా స్థలాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గాయాలైన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. మృతి చెందిన సోను కుటుంబానికి తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు నవీన్ యాదవ్ .

## తల్లిదండ్రులు ఎప్పుడూ గొడవపడుతున్నారని.. 13 ఏండ్ల బాలుడు ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** తమ తల్లిదండ్రులు ఎప్పుడూ గొడవ పడుతున్నారని 13 ఏండ్ల బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని రహీంపురా కు చెందిన రవి, అపర్ణ దంపతులకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. అయితే తన పేరెంట్స్ ఎప్పుడూ గొవడం పడటం విరాట్(13)కు నచ్చేది కాదు. పలు సార్లు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేక పోవడంతో తనలో తానే మదనపడేవాడు. ఎప్పటిలాగే నవంబర్ 22న సాయంత్రం విరాట్ తల్లిదండ్రులు మరోసారి గొడవ పడ్డారు. దీంతో ఇకపై గొడవలు ఆపకుంటే తాను చనిపోతానని ఆ బాలుడు తన తల్లిదండ్రులను హెచ్చరించాడు. తాను భవిష్య త్తులో ఏమీ చేసుకోకుండా ఉండాలంటే గొడవ పడమని సంతకం చేయాలని ఒక కాగితంపై రాసి ఇచ్చాడు. దానిపై తండ్రి సంతకం చేశాడు. తల్లి ఆలోచనలో పడగా.. ఇంతలోనే పక్క గదిలోకి వెళ్లి ఉరేసుకుని సూసైడ్ చేసుకున్నాడు.

## సరూర్ నగర్లో మెట్రో పిల్లర్ ను ఢీ కొట్టిన బైక్..ఇద్దరు యువకులు స్పాట్ డెడ్



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ సరూర్ నగర్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నవంబర్ 23న వేకువజామున 5 గంటలకు ఓ బైక్ అదుపు తప్పి మెట్రో పిల్లర్ ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న ఇద్దరు స్పాట్ లోనే చనిపోయారు. విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ సమీపంలో పిల్లర్ నంబర్ 1618 దగ్గర ఈ ప్రమాదం జరిగింది. మోహన్ నగర్, టెలిఫోన్ కాలనీ ప్రాంతాలకు చెందిన ఇద్దరు స్నేహితులు మధు, హరీష్ బైక్‌పై అతివేగంతో ప్రయాణిస్తుండగా నియంత్రణ కోల్పోయి మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడమే చనిపోయారు. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ సిటీలో డ్రంక్అండ్ డ్రైవ్.. వీకెండ్ స్పెషల్ డ్రైవ్..424 మందిపై కేసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీ వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు సైబరాబాద్ట్రాఫిక్ పోలీసులు. సిటీలోని ప్రధాన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు... వీకెండ్స్ అంటే శనివారం, ఆదివారం రోజుల్లో 424 కేసులు నమోదు చేశారు. మాదాపూం ్,రాజేంద్రనగర్, శంషాబాద్, షాద్ నగర్ చేవెళ్ల, నార్సింగి, రాయదుర్గం, మియాపూర్, కూకట్‌పల్లి, బాలానగర్, జీడిమెట్ల, అల్వాల్?వంటి ప్రాంతాల్లో పెద్దెత్తున డ్రంకర్లు పట్టుబడ్డగారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తో ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఇలాంటి సందర్భంలో BNS 2023 సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేశారు. వీరికి 10ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించారు.

హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఆదివారం ( నవంబర్ 23) విస్తృతంగా డ్రంక్? అండ్? డ్రైవ్? తనిఖీలు నిర్వహించారు ట్రాఫిక్ పోలీసులు. శని, ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 424 మందిపై కేసులు నమోదు చేశారు. డ్రంక్? అండ్? డ్రైవ్? తో ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఇలాంటి సందర్భంలో %దీచీూ% 2023 సెక్షన్? 105 కింద కేసులు నమోదు చేశారు. వీరికి 10ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించారు. గత వారం డ్రంక్? అండ్? డ్రైవ్? లో దొరికిన దాదాపు 800 కేసుల్లో 358 కేసులు పరిష్కారం అయ్యాయి. 304 మందికి జరిమానా విధించింది కోర్టు. 22 మందికి జరిమానాతోపాటు సోషల్? సర్వీస్?, 32 మందికి జరిమానా, జైలు శిక్ష రెండూ విధించారు.

# ఆయనను ఎన్‌కౌంటర్ చేస్తే ఆ బాధేంటో తెలుస్తుంది: 'ఐబొమ్మ' రవి తండ్రి అప్పారావు

- నిర్మాత సీ.కల్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన 'ఐబొమ్మ' రవి తండ్రి
- 'ఐబొమ్మ' రవిని ఎన్‌కౌంటర్ చేయాలన్న నిర్మాత సి.కల్యాణ్
- మిమ్మల్ని ఎన్‌కౌంటర్ చేస్తే ఆ నొప్పి ఏంటో తెలుస్తుందన్న అప్పారావు
- సినిమాల్లో విషయం ఉంటే ప్రేక్షకులు తప్పక చూస్తారని వ్యాఖ్య
- కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీయమని ఎవరూ అడగలేదంటూ ఆగ్రహం
- కొడుకు తరపు న్యాయవాదికి ఆర్థిక సాయం చేస్తానని ప్రకటన




**హైదరాబాద్ పెన్ పవర్:**'ఐబొమ్మ' పైరసీ వెబ్ సైట్ వ్యవహారంలో నిర్మాత సి.కల్యాణ్ చేసిన "ఎన్‌కౌంటర్" వ్యాఖ్యలపై 'ఐబొమ్మ' రవి తండ్రి అప్పారావు తీవ్రంగా స్పందించారు. సి.కల్యాణ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే ఆ బాధ ఏంటో తెలుస్తుందని ఆయన ఘాటుగా బదులిచ్చారు. తన కుమారుడిని ఉద్దేశించి అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. "సినిమాలో సరైన విషయం ఉంటే ప్రేక్షకులు కచ్చితంగా థియేటర్లకు వచ్చి చూస్తారు. నేను ఒకప్పుడు 45 పైసలకే సినిమా చూశాను. కానీ ఇప్పుడు టికెట్ ధరలను దారుణంగా పెంచేశారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి సినిమాలు ఎవరు తీయమంటున్నారు?" అని ప్రశ్నించారు. చిత్ర పరిశ్రమ తమ తప్పులను సరిదిద్దుకోవాలి తప్ప, ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

అంతేకాకుండా, తన కుమారుడి తరఫున వాదిస్తున్న న్యాయవాదికి తాను ఆర్థికంగా అండగా ఉంటానని అప్పారావు స్పష్టం చేశారు. ఈ విషయంలో న్యాయపరంగానే ముందుకు వెళతామని ఆయన వెల్లడించారు.

తెలుగు సినిమా పరిశ్రమకు 'ఐబొమ్మ' వల్ల వేల కోట్ల నష్టం వాటిల్లిందని, 'ఐబొమ్మ' రవి వంటి వారిని ఎన్‌కౌంటర్ చేయాలని నిర్మాత సి.కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే రవి తండ్రి అప్పారావు తాజాగా స్పందించారు.

# నవంబర్ 25న అయోధ్య రామమందిరంలో ధ్వజారోహణం.. ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్ పెన్ పవర్:**అయోధ్య రామమందిరంలో ధ్వజారోహణ కార్ర్యమానికి అంతా సిద్ధమైంది. ఎల్లుండి (నవంబర్25)న ఉదయం 11.30 గంటలకు ఆలయ శిఖరంపై జెండాను ఎగురవేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్, యూపీ సీఎం ఆదిత్యానాథ్, గవర్నర్ హాజరు కానున్నారు. ధ్వజారోహణ ఉత్సవాలను పురస్కరించుకొని ఇవాళ్టి(ఆదివారం) అర్ధరాత్రి నుంచి ఆలయ సమీపంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. వాహనాలను దారి మళ్లించేందుకు ఏర్పాట్లు చేశారు. ధ్వజారోహణ కార్యక్రమం అయోధ్య రామ జన్మభూమి ఆలయ ప్రధాన నిర్మాణం పూర్తియినట్లు సూచిస్తుంది. ఇది అయోధ్యలో ఆధ్యాత్మిక , సాంస్కృతిక మైలురా యిని అని చెప్పొచ్చు. అయోధ్య ధామ్ పేరు మరోసారి చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో రాసుకోబోతోంది.. ప్రధాని మోదీ మార్గదర్శ కత్వంలో అయోధ్య ధామ్‌లో జరుగుతున్న ప్రతి పని భగవంతుడు శ్రీరాముని జీవిత విలువల నుంచి ప్రేరణ పొందిందని యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ తన సోషల్ మీడియా ప్లాట్ ఫాం Xలో పోస్ట్ ను షేర్ చేశారు.

నవంబర్ 25న అయోధ్యలో జరిగే ఈ చారిత్రాత్మక ధ్వజారోహణం ఒక గొప్ప ఆలయ నిర్మాణం పూర్తి అయిన సందర్భంగా జరుపుకునే ఉత్సవమే కాకుండా.. నగరాన్ని ఏకం చేసే సంప్రదాయం, ఆధ్యాత్మికత ,ప్రగతిశీల అభివృద్ధికి ఓ కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందని యోగి చెప్పారు.

# ఏటీఎం వ్యాన్ నుంచి రూ.7.11 కోట్ల లూటీ... దొంగలకు శిక్షణ ఇచ్చింది కానిస్టేబులే!



**హైదరాబాద్ పెన్ పవర్:**నగరంలో సంచలనం సృష్టించిన ఏటీఎం వ్యాన్ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఓ పోలీస్ కానిస్టేబులే సూత్రధారిగా వ్యవహరించి, దొంగల ముఠాకు శిక్షణ ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. నవంబర్ 19న డెయిరీ సర్కిల్ ఫ్లైఓవర్‌పై జరిగిన ఈ దోపిడీలో రూ.7.11 కోట్లు అపహరణకు గురవగా, ఇప్పటివరకు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6.29 కోట్లను స్వాధీనం చేసుకున్నారు.

**సినిమా ఫక్కీలో దోపిడీ**

సీఎంఎస్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కు చెందిన నగదు వ్యాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దోపిడీ జరిగింది. ఫ్లైఓవర్‌పై వ్యాన్‌ను అడ్డగించిన 6 నుంచి 8 మంది సభ్యుల ముఠా, తాము 'ఆర్‌బీఐ అధికారులుగా' పరిచయం చేసుకుంది. డ్రైవర్‌ను నమ్మించి, వ్యాన్‌లోని నగదును కొల్లగొట్టింది. ఈ కుట్రలో ముగ్గురు కీలక సూత్రధారులు కాగా, మిగిలిన వారు వారికి సహకరించారు. దోపిడీ అనంతరం ముఠా నగరం విడిచి పరారైంది.

**పోలీసే గురువు**

ఈ దోపిడీకి గోవిందపుర పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అన్నప్ప నాయక్ మాస్టర్‌మైండ్‌గా వ్యవహరించాడు. మూడు నెలల పాటు పక్కా ప్రణాళికతో, దొంగల ముఠాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. సీసీటీవీ కవరేజ్ లేని ప్రాంతాలను గుర్తించడం, దోపిడీ అనంతరం ఆధారాలు వదలకుండా ఎలా తప్పించుకోవాలనే దానిపై 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఈ కుట్రలో కంపెనీ ఉద్యోగుల ప్రమేయం కూడా బయటపడింది. సీఎంఎస్ కంపెనీ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ గోపాల్ ప్రసాద్, క్యాష్ వ్యాన్ వెళ్లే మార్గం, సమయం వంటి రియల్‌టైమ్ సమాచారాన్ని ముఠాకు అందించాడు. కంపెనీ మాజీ ఉద్యోగి ఎక్సావియర్, దోచుకున్న డబ్బును నగరం దాటించడంలో కీలక పాత్ర పోషించాడు.

**ఆరు రాష్ట్రాల్లో వేట.. 72 గంటల్లో ఛేదన**

కేసును సవాలుగా తీసుకున్న బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ), సౌత్ డివిజన్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. కేరళ, తమిళనాడు, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో 200 మంది పోలీసులు ఏకకాలంలో గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ డేటా, మానవ ఇంటెలిజెన్స్ సహాయంతో కేవలం 72 గంటల్లోనే ప్రధాన కుట్రదారులైన అన్నప్ప నాయక్, గోపాల్ ప్రసాద్, ఎక్సావియర్‌లను బెంగళూరులో అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.5.76 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ఓ లాడ్జ్‌లో నవీన్, నెల్సన్‌లను పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.53 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి ఉపయోగించిన ఎస్‌యూవీ వాహనాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో పగిలిపోయిన క్యాష్ చెస్టులతో గుర్తించారు. పరారీలో ఉన్న రవి సహా మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.


ఈ ఘటనపై స్పందించిన బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమాంత్ కుమార్ సింగ్, సీఎంఎస్ కంపెనీ ఆర్‌బీఐ మార్గదర్శకాలను ఉల్లంఘించిందని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ దోపిడీ జరిగిందని ఆరోపించారు. కంపెనీ లైసెన్సును రద్దు చేయాలని సిఫార్సు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా మిగిలిన రూ.82 లక్షల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# రూ. 26 లక్షల కోసం గొడవ.. ఢిల్లీ పేలుడు నిందితుల మధ్య చిచ్చు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఈ నెల 10న ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడికి పాల్పడిన 'వైట్ కాలర్' ఉగ్రవాద ముఠా సభ్యుల మధ్య సిద్ధాంతపరమైన, ఆర్థిక విభేదాలు ఉన్నాయని ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. ఈ పేలుడులో 13 మంది మరణించగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే.వివరాల్లోకి వెళితే... పేలుడు పదార్థాలున్న హ్యుందాయ్ ఐ20 కారును నడిపిన కశ్మీరీ డాక్టర్ ఉమర్-ఉన్-నబీకి, అతని సహచరులకు మధ్య ఐసిస్, అల్-ఖైదా ఉగ్రవాద సంస్థల భావజాలం విషయంలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఉమర్ ఐసిస్ సిద్ధాంతాలను అనుసరించగా, అదీల్ అహ్మద్ రథేర్ వంటి ఇతర నిందితులు అల్-ఖైదాను నమ్మారు. ఈ విభేదాల కారణంగానే ఈ ఏడాది జరిగిన అదీల్ పెళ్లికి కూడా ఉమర్ హాజరుకాలేదని తెలుస్తోంది.అంతేకాకుండా దాడి కోసం సమీకరించిన రూ. 26 లక్షల నిధుల విషయంలోనూ వారి మధ్య గొడవలు జరిగాయి. ఈ నిధులకు లెక్కలు చెప్పాలని అడగడంతో ఉమర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ మొత్తంలో అదీల్ రూ. 8 లక్షలు, షాహీన్ సయీద్, ముజమ్మిల్ షకీల్ చెరో రూ. 5 లక్షలు, పరారీలో ఉన్న ముజఫర్ అహ్మద్ రథేర్ రూ. 6 లక్షలు సమకూర్చగా, ఉమర్ వాటా కేవలం రూ. 2 లక్షలు మాత్రమే.పేలుడుకు ముందు రోజే తన సహచరులు షాహీన్, ముజమ్మిల్ అరెస్ట్ కావడంతో ఉమర్ తీవ్రంగా కలవరపడ్డాడు. తొలుత ఎర్రకోట పార్కింగ్‌లో కారును పేల్చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, సోమవారం కావడంతో అక్కడ జనం లేకపోవడం గమనించాడు. మూడు గంటల పాటు వేచి చూసి, చివరకు బయటకు వచ్చి ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారును పేల్చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు కొన్ని గంటల ముందే జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ 'వైట్ కాలర్' ఉగ్రవాద ముఠాను ఛేదించి, 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

## జీవం ఎప్పుడు పుట్టింది ? AI పుణ్యమా అని నిజం తెలిసిందా..?



**హైదరాబాద్ పెన్ పవర్:**సైంటిస్ట్‌లు గతంలో అందుబాటులో ఉన్న సాంకేతికతతో సుమారు 2.7%-%2.8 బిలియన్ సంవత్సరాల క్రితం భూమిపై జీవం పుట్టిందని అంచనా వేశారు. అయితే.. ఇప్పుడు ఏఐ వల్ల ఆ కాలం మరో 600 మిలియన్ సంవత్సరాలు వెనక్కి వెళ్లింది.ఆస్ట్రేలియాలోని పిల్బరా క్రాటన్ ప్రాంతంలో దొరికిన 3.3 బిలియన్ సంవత్సరాల నాటి శిలల లోపల జీవులకు సంబంధించిన కెమికల్స్ ఉన్నట్లు సైంటిస్ట్?లు కనుగొన్నారు. ఈ పరిశోధనలో మొదటిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్?ను ఉపయోగించారు.కర్టిన్ యూనివర్సిటీ (ఆస్ట్రేలియా), ఆక్స్?ఫర్డ్ యూనివర్సిటీల ప్రొఫెసర్లు చేసిన ఈ రీసెర్చ్?లో గూగుల్ డీప్‌మైండ్ డెవలప్ చేసిన ప్రత్యేక ఏఐ మోడల్ "జియో కెమ్ నెట్" కీలక పాత్ర పోషించింది. ఇలాంటి శిలల్లో రసాయన సమ్మేళనాలు అతి సూక్ష్మ స్థాయిలో ఉంటాయి.సంప్రదాయ పద్ధతులతో అందులోని ఆధారాలను గుర్తించడం చాలా కష్టం. కానీ.. ఏఐ మాత్రం ఈజీగా గుర్తించింది. అందుకోసం ఏఐకి 4.7 లక్షలకు పైగా పురాతన శిలల డేటాతో ట్రైనింగ్ ఇచ్చారు. సైంటిస్ట్?లు18 నెలల్లో చేసే విశ్లేషణను ఇది కేవలం 11 రోజుల్లో పూర్తి చేసింది.

## కుటుంబమంతా దేశసేవలోనే.. విషాదంలో తేజస్ పైలట్ నమాన్ష్ కుటుంబం



**హైదరాబాద్ పెన్ పవర్:**దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ జెట్ కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో భారత వాయుసేనకు చెందిన పైలట్ నమాన్ష్ శ్యాల్ దుర్మరణం పాలయ్యారు. ఆకాశంలో విన్యాసాలు చేస్తూ అకస్మాత్తుగా జెట్ కుప్పకూలడంతో ఆయనకు బయటపడే అవకాశం లేక ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్ ప్రదేశ్ కు చెందిన నమాన్ష్ కుటుంబం మొత్తం దేశ సేవలో నిమగ్నమై ఉంది. ఆయన తండ్రి జగన్నాథ్ శ్యాల్ సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేశారు.తల్లి వీణ గృహిణి కాగా, నమాన్ష్ భార్య అఫ్షాన్ కూడా ఎయిర్ ఫోర్స్ లో ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. నమాన్ష్ దుబాయ్ ఎయిర్ షోలో ప్రదర్శన చేస్తున్న సమయంలో అఫ్షాన్ కోల్ కతాలో ట్రైనింగ్ తీసుకుంటున్నారు. ప్రమాద వార్త తెలిసి హుటాహుటిన కోయంబత్తూరులోని అత్తామామల వద్దకు చేరుకున్నారు. నమాన్ష్, అఫ్షాన్ దంపతులకు ఆర్య (7) అనే కుమార్తె ఉంది. కాగా, హిమాచల్ ప్రదేశ్ లోని కాంగ్రా జిల్లా పతియాల్కర్ గ్రామంలో నమాన్ష్ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈరోజు సాయంత్రం అంత్యక్రియలు పూర్తవుతాయని ఆయన బంధువులు తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ పాయింట్లు సవరించాలి

హైదరాబాద్ పెన్ పవర్:ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సవరించాలని మాల మహానాడు జాతీయాధ్యక్షుడు జి.చెన్నయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మాలల రణభేరి మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ పాయింట్లు సవరించకపోతే మాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను హరిస్తే చూస్తూ ఊరుకోం. మాదిగలనే కాదు, మాలలను కూడా ప్రభుత్వం చూడాలి. షెడ్యూల్డ్ కులాల్లో వెనుకబాటుకు గురైన కుటుంబాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు సరైన డేటా తీసుకొని సరిచేయాలని సుప్రీంకోర్టు చేసిన సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పాటించలేదు. మేం అన్ని రంగాల్లోనూ అణచివేతకు గురవుతున్నాం. మాలలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం' అని స్పష్టం చేశారు. తమ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై చెన్నయ్యతో పాటు.. మాల మహానాడు రాష్ట్రాధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళాధ్యక్షురాలు మల్లేశ్వరి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి



హైదరాబాద్ పెన్ పవర్: రెవెన్యూ సేవలను ప్రతి రైతుకు చేర్చి ప్రజా ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత గ్రామపాలన అధికారులపై ఉందని తెలంగాణ ఉద్యోగుల ఐకాస అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం 'గ్రామపాలన అధికారుల (జీపీవో) అసోసియేషన్ తెలంగాణ' సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తేనే క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయన్నది ప్రభుత్వ ఉద్దేశం. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన జీపీవోలపై ప్రభుత్వం గురుతర బాధ్యతలు పెట్టింది' అన్నారు. జీపీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గరికె ఉపేంద్రరావు, మహిళా అధ్యక్షురాలిగా కంది శిరీషరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అర్జున్ మల్లారం, కోశాధికారిగా వింజమూరి ఈశ్వర్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాములు, పాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 1500 కి.మీ. ప్రయాణం.. 3 నెలల తర్వాత యజమానిని చేరిన శునకం!

- చైనాలో మూడు నెలల క్రితం తప్పిపోయిన పెంపుడు శునకం
- 1500 కిలోమీటర్ల దూరంలో సురక్షితంగా లభ్యం
- సోషల్ మీడియా వీడియో ద్వారా గుర్తించిన యజమాని
- యజమానిని చూడగానే కన్నీళ్లు పెట్టుకున్న శునకం



హైదరాబాద్ పెన్ పవర్:మూడు నెలల క్రితం తప్పిపోయిన ఓ పెంపుడు శునకం, సుమారు 1500 కిలోమీటర్లు ప్రయాణించి తిరిగి తన యజమాని చెంతకు చేరిన అద్భుత ఘటన చైనాలో చోటుచేసుకుంది. ఈ సంఘటన ఎంతోమందిని భావోద్వేగానికి గురిచేస్తోంది.

**అసలేం జరిగిందంటే..!**

తూర్పు చైనాలోని షాన్డాంగ్ ప్రావిన్స్‌లోని కింగ్‌డావో బీచ్‌లో గావో అనే మహిళ పెంచుకుంటున్న 'సెప్టెంబర్' అనే లాబ్రడార్ శునకం ఆగస్టు 13న తప్పిపోయింది. సమీపంలోని బీర్ ఫెస్టివల్ సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, అది మరో కుక్కతో కలిసి వెళ్లిపోయినట్లు కనిపించింది. గావో తన శునకం కోసం జంతు సంరక్షణ కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో విస్తృతంగా గాలించినా ఫలితం లేకపోవడంతో ఆశలు వదులుకుంది. అయితే, సుమారు మూడు నెలల తర్వాత కింగ్‌డావోకు 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న చాంగ్షా నగరంలో భారీ వర్షంలో తడుస్తూ వీధుల్లో తిరుగుతున్న సెప్టెంబర్‌ను ఝౌ అనే మహిళ గమనించి, దాన్ని తన ఇంటికి తీసుకెళ్లింది. ఆ శునకానికి సంబంధించిన వీడియోలను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, అవి కాస్తా గావో కంటపడ్డాయి. వెంటనే ఆమె ఝౌను సంప్రదించారు.

ఈ నెల 8న పెట్ రిలోకేషన్ సర్వీస్ ద్వారా గావో తన శునకాన్ని తిరిగి ఇంటికి తెప్పించుకున్నారు. యజమానిని చూడగానే సెప్టెంబర్ ఆమెపైకి దూకి కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కదిలించింది. "బహుశా పర్యాటకులు ఎవరైనా దాన్ని దొంగిలించి లేదా తమతో తీసుకెళ్లి ఉండవచ్చు. ఎలాగైనా అది చాలా కష్టాలు పడింది" అని గావో అన్నారు. అయితే, తప్పిపోయిన ఈ మూడు నెలల్లో బద్ధకస్తురాలైన తన శునకం ఎంతో చురుగ్గా మారిందని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ అద్భుత పునఃసమాగమంపై సోషల్ మీడియాలో నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పురుటి నొప్పులతో భార్య.. అయినా వర్క్ ఫ్రం హాస్పిటల్ చేయాలన్న మేనేజర్


- ఆసుపత్రిలో నువ్వు చేసేదేముంటుందని ఎద్దేవా
- రెడ్డిట్ లో వైరల్ గా మారిన ఉద్యోగి పోస్ట్
- మేనేజర్ తీరుపై దుమ్మెత్తిపోస్తున్న యూజర్లు



హైదరాబాద్ పెన్ పవర్:కార్పొరేట్ కంపెనీల పని సంస్కృతిపై ఉద్యోగులు తరచుగా విమర్శలు చేస్తుండడం చూస్తూనే ఉంటాం.. అనారోగ్యంతో ఉన్నా, ఆసుపత్రి బెడ్ మీద ఉన్నా వర్క్ చేయాలంటూ బాస్ ఆదేశించిడమూ తెలుసు. తాజాగా ఇలాంటి అనుభవమే ఓ ఉద్యోగికి ఎదురైంది. ఈ విషయాన్ని ఆయన తన రెడ్డిట్ ఖాతాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్ గా మారింది. ఓవైపు తన భార్య పురుటి నొప్పులతో ఆసుపత్రిలో ఉందని చెప్పినా మేనేజర్ తనను వర్క్ ఫ్రం హాస్పిటల్ చేయాలని అడిగాడంటూ ఆ పోస్టులో పేర్కొన్నాడు. దీంతో సదరు మేనేజర్ పై సోషల్ మీడియా యూజర్లు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇండియన్ వర్క్ ప్లేస్ అనే రెడ్డిట్ యూజర్ పోస్ట్ చేసిన వివరాల ప్రకారం.. ఓ కార్పొరేట్ కంపెనీ ఉద్యోగి భార్య నిండు గర్భిణీ. డెలివరీ కోసం ఆమెను ఆసుపత్రిలో చేర్పించాడు. ఆపై విషయం స్పష్టంగా వివరిస్తూ రెండు రోజులు సెలవు కావాలంటూ మేనేజర్ కు మెసేజ్ చేశాడు. దీనికి మేనేజర్ ఇచ్చిన జవాబు చూసి తీవ్ర అసంతృప్తికి లోనయ్యాడు. 'ఇప్పుడు సెలవు ఇవ్వడం కుదరదు. వచ్చే వారం తీసుకుందువులే. అయినా మీ ఆవిడ డెలివరీకి నువ్వు చేసేదేముంది? ఆసుపత్రి నుంచే వర్క్ చేయొచ్చు కదా' అంటూ ఆ మేనేజర్ జవాబిచ్చాడు.'అలా కుదరదండి, ఆసుపత్రిలో పేషెంట్ ను చూసుకోవాల్సింది నేనే. మెడికల్ షాపుకు వెళ్లడం, ఇతరత్రా పనులు ఉంటాయి. పైగా ఆసుపత్రి నుంచి ఆఫీసు వర్క్ చేయడం వీలుకాదు' అని ఆ ఉద్యోగి చెప్పడంతో అయిష్టంగానే మేనేజర్ సెలవు మంజూరు చేశాడు.

# 30 ఏండ్లకే సన్యాసం.. 70 ఏండ్లు పీఠాధిపతి

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ వైష్ణవంలో ఆళ్వారుల తర్వాత కొత్త గురువుల వర్గం వచ్చింది. వాళ్లనే ఆచార్యులు అంటారు. వీళ్లు తమ పూర్వీకుల చేసిన సేవలను ఒకచోటుకు చేర్చడం, వర్గం వారిని అంతర్గతంగా బలోపేతం చేయడం. వాళ్లకు ప్రస్తుతం, భవిష్యత్?లో జరిగే హింసాకాండలను ఎదుర్కొనే వనరులను కల్పిస్తారు. శంకరులు 'అద్వైతం' తత్వాన్ని వాదన, శాస్త్ర పటిమతో బలపరిచాడు. పదో శతాబ్దం చివరికల్లా శంకరుని అద్వైతం చరిత్రలో నిలిచిపోయింది. బలిష్టమైన చోళ వంశంవారు పరిపాలనకు రావడం, వారికి శివారాధన పట్ల గల పక్షపాతం శ్రీ వైష్ణవ తత్వ ఐక్యతకు ప్రమాదకరంగా పరిణమించింది. శ్రీ వైష్ణవంలో నేతృత్వం చేపట్టడానికి మంచి వారసుడు కావాలని ఆయన ప్రభువును వేడుకున్నాడు. ఆయన ప్రార్థన ఫలించింది. ఆయన మనవడు తన సోదరీమణులతో సహా తిరుమలైలో విష్ణు ఆలయం దగ్గర స్థిరపడ్డాడు. వారిలో ఒకామెకు ప్రాచీన సాంస్కృతిక, రాజకీయ చోళ వైస్రాయ్?కి కేంద్రమైన నివాసితో వివాహమైంది. ఆమెకు పుట్టిన కొడుకే రామానుజుడు.. అందగాడు, తెలివైనవాడు. తన తండ్రి విద్యాబోధనలో అతడు అప్పటి సంప్రదాయ విద్యల సారాన్ని, మత, ఐహిక విషయాలను ఔపోసన పట్టాడు. 17వ ఏటనే ఆయనకు పెండ్లి అయింది. తండ్రి కేశవ సోమయాజి ఆ తర్వాత కొద్దికాలానికే మరణించాడు. అప్పుడు



రామానుజుడు తన తల్లి, భార్యతో సహా కంచికి వెళ్లాడు. అక్కడ ఉన్న 'యాదవ ప్రకాశ' అనే పండితుని దగ్గర అద్వైత సిద్ధాంతాన్ని ఆరు సంవత్సరాలు అభ్యసించాడు.

ఆ కాలంలో గురుశిష్యులిద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అందుకు కారణం రామానుజుని బుద్ధి సూక్ష్మత, పాండిత్యము, స్వతంత్ర భావాలు. దాంతో కోపగించుకున్న గురువు తన విద్యార్థులందరితో కలిసి కాశీ యాత్రకు బయలుదేరాడు. కొద్దిదూరం ప్రయాణం చేశాక రామానుజునికి అనుమానం కలిగింది. దాంతో ఆయన వారి నుంచి విడిపోయి ఒంటరిగా తిరుగు ప్రయాణమయ్యాడు. వాళ్లు తిరిగి వచ్చాక విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. తనకు 22 ఏండ్లు నిండకముందే తన తెగలో వీరుడిగా కీర్తిగాంచాడు. వయసుమీరిన యమునాచార్యుల కోసం వెంటనే శ్రీరంగం రమ్మని పిలువనంపాడు. ఆయన వచ్చేసరికి యమునాచార్యులు మరణించారు. తీవ్ర నిరాశానిస్పృహలకు గురైన ఆయన తిరిగి కంచికి వెళ్లాడు. ఆయన చేస్తున్న అన్వేషణలో సంసారజీవితం ప్రతిబంధకంగా అనిపించింది. అప్పటికే తల్లి మరణించింది. దాంతో సంసార జీవితానికి స్వస్థి పలకాలి అనుకున్నాడు. అందుకోసం భార్యకు కావాల్సినవన్నీ సమకూర్చి, 30 ఏండ్ల వయసులో విష్ణు ఆలయంలో సన్యాసం తీసుకున్నాడు. సన్యాస వర్గంలో ఆయన గొప్పవాడు. యమునాచార్యుని శిష్యుల ఒత్తిడితో ఆయన శ్రీరంగానికి వెళ్లి ఒక గొప్ప గురువు వారసుడిగా పీఠాధిపతి అయ్యాడు. అది 70 సంవత్సరాలకు పైగా కొనసాగింది. పీఠాధిపతిగా తాత్విక సాహిత్యాన్ని 'శ్రీ భాష్యం'గా అందించాడు. సాధారణ స్థాయి విద్యార్థుల కోసం బ్రహ్మ సూత్రాలను క్లుప్తంగా మూడు భాగాలుగా రాశాడు. అప్పటికే చోళ సామ్రాజ్యంలో ఒక బలమైన జాతి రూపుదిద్దుకుంటూ ఉంది. ఐదుగురి తర్వాత సింహాసనం ద

కుళోత్తుంగుడు%-%1కు స్వాధీనమైంది. రామానుజుడు మైసూరుకు వెళ్లాడు. రామానుజుడు తప్పించుకున్న విషయం తెలిసిన చోళ చక్రవర్తి ఆయన శిష్యుడిని చనిపోయేంతగా హింసించాడు. మైసూరులో 20 ఏండ్లు ఉన్న ఆయన విష్ణువర్ధనుడు అనే నామంతో వైష్ణవులుగా మారిన వారిని శ్రీవైష్ణవాసంలో ఉంచారు. ఐదు గొప్ప దేవాలయాలు యదుగిరి లోని నారాయణాలయంతో సహా విష్ణువును అంకితం చేశారు. కుళోత్తుంగ చోళుడు%-%1 మరణించిన తర్వాత శ్రీరంగానికి వచ్చిన రామానుజుడు మరో పదేండ్లు సంచారం కొనసాగించాడు. క్రీ.శ. 1137లో మరణించాడు.

# సైలెంట్ కిల్లర్ ఇది : కొలెస్ట్రాల్ గురించి మీరు తెలుసుకోవాల్సిన 6 ముఖ్య విషయాలు ఇవే..!

**హైదరాబాద్ పెన్ పవర్:**చాలాకాలంగా మన తినే ఆహారంలో ఉండే కొలెస్ట్రాల్ మంచిది కాదని, గుండెపోటుకు కారణమవుతుందని చాల మంది అనుకుంటారు. అయితే సైన్స్ మారుతున్న కొద్దీ మనకు దానిపై ఉన్న అవగాహన కూడా మారుతోంది. అయితే చెడు కొలెస్ట్రాల్ హానికరం కాదు, అలాగని ప్రతి తక్కువ కొవ్వు(low-fat) ఆహారం కూడా గుండెకు మంచిది కాదు.మన దేశంలో యువకులు కూడా గుండె జబ్బులతో బాధపడుతున్నారు, అందుకే కొలెస్ట్రాల్ గురించి సరిగ్గా తెలుసుకోవడం ముఖ్యం. డాక్టర్ రవి మాలిక్ కొలెస్ట్రాల్ గురించి దశాబ్దాలుగా ఉన్న కొన్ని అపోహలను తొలగిస్తు వివరించారు. కొలెస్ట్రాల్ మంచిది కాదు అనేది అపోహ. ఎందుకంటే మన శరీరానికి కొలెస్ట్రాల్ నిజంగా అవసరం. ఇది కణాలను తయారు చేయడానికి, హార్మోన్లు, విటమిన్ డి, కొవ్వును జీర్ణం చేసే పిత్త ఆమ్లాలను తయారు చేయడానికి ఉపయోగపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ (HDL) రక్తంలోని అధిక కొలెస్ట్రాల్‌ను కాలేయానికి పంపి, శరీరం నుండి బయటకు పంపడానికి సహాయపడుతుంది. చెడ్డ కొలెస్ట్రాల్ (LDL) ధమనుల్లో కొవ్వు పేరుకుపోయేలా చేస్తుంది, గుండెపోటు ఇంకా స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. డాక్టర్ మాలిక్ చెప్పినట్లు కొలెస్ట్రాల్ శత్రువు కాదు, సమానంగా లేకపోవడం సమస్య. ఎక్కువ LDL ఇంకా తక్కువ %ఎణూ% కలిస్తేనే గుండెకు హాని. గుడ్లు అనారోగ్యకరం, తినకూడదు అనే నమ్మకం చాలా పాతది, ఇది నిజం కాదు. మీరు ఆహారంలో తీసుకునే



కొలెస్ట్రాల్ మీ రక్తంలోని కొలెస్ట్రాల్‌ను నేరుగా పెంచదు, మీ కాలేయం మీరు తినే దాని ఆధారంగా, కొలెస్ట్రాల్ ఉత్పత్తిని అడ్జస్ట్ చేస్తుంది అని డాక్టర్ మాలిక్ చెబుతున్నారు. చాలా మందికి, గుడ్లు లిమిట్ గా తినడం మంచిది. గుడ్డు కంటే, దానితో పాటు తీసుకునే వెన్న, చీజ్ లేదా నూనెలో వేయించినవి ఆరోగ్య సమస్యకు కారణమవుతాయి. అధిక బరువు ఉన్నవారికి లేదా వృద్ధులకు మాత్రమే కొలెస్ట్రాల్ వస్తుంది అనేది కూడా పెద్ద అపోహ. నిజం ఏంటంటే అధిక కొలెస్ట్రాల్ ఒకరి వయస్సు, బరువు చూడదు. సన్నగా, ఆరోగ్యంగా కనిపించే వారికి కూడా జన్యువులు, ఒత్తిడి, సరైన ఆహారం లేకపోవడం లేదా వ్యాయామం చేయకపోవడం వల్ల కొలెస్ట్రాల్ పెరగవచ్చు. సిటీ నగరాల్లోని యువత కూడా అధిక LDL స్థాయిలతో బాధపడుతున్నారు. అందుకే మొదటి లక్షణం కనిపించే వరకు ఆగకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

దురదృష్టకమైన విషయం ఏంటంటే అధిక కొలస్ట్రాల్ ఉందొ లేదో అనేది ఈజీగా తెలుసుకోవడం సాధ్యం కాదు. అధిక కొలెస్ట్రాల్ సైలెంటుగా ఉంటుంది, పరిస్థితి ఆలస్యం అయ్యే కొద్దీ ఎలాంటి లక్షణాలు చూపదు. అధిక కొలస్ట్రాల్ నొప్పి లేదా అసౌకర్యాన్ని కలిగించదు. కానీ గుండెపోటు లేదా స్ట్రోక్ వచ్చే వరకు నిశ్శబ్దంగా ఉంటుంది. అందుకే ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన వారు లేదా గుండె జబ్బులు ఉన్నవారు లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు చేయించుకోవాలి.అయితే కొలెస్ట్రాల్ తగ్గడానికి తక్కువ కొవ్వు ఉన్న ఆహారమే తినడం ఉత్తమం అనేది ఒక అపోహ. వాస్తవం ఏంటంటే అన్ని కొవ్వులు చెడ్డవి కావు. సరైనవి ఎంచుకోవడమే ముఖ్యం. ఆలివ్ ఆయిల్, నట్స్, సీడ్స్, కొవ్వు చేపల (ఫ్యాటీ ఫిష్) నుండి వచ్చే ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి, మీ గుండెను కాపాడతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఎక్కువగా నెయ్యి వాడిన స్వీట్లు, డీప్-ఫ్రై చేసిన స్నాక్స్‌లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్, చిక్కటి కొవ్వులు నిజమైన శతువులు. మీ భోజనాన్ని బ్యాలెన్స్ గా చేసుకోండి. మీ శరీరం సరిగా పనిచేయడానికి మంచి కొవ్వులు అవసరం. భారతీయ సాంప్రదాయ ఆహారాలు అన్నీ ఆరోగ్యకరమైనవే అనేది నిజం కాదు. భారతీయ వంటకాల్లో పప్పులు, ధాన్యాలు, మసాలాలు వంటి అద్భుతమైన పోషకాలు ఉన్నాయి. కానీ వాటిని తయారుచేసే విధానం ఎక్కువగా వాటిని అనారోగ్యకరంగా మారుస్తుంది. చాలా సాంప్రదాయ వంటకాల్లో ఎక్కువ నూనె, నెయ్యి లేదా చక్కెర వాడతారు. ఇక్కడ వంటకాలు కాదు, తయారీ పద్ధతులే అసలు సమస్య. తక్కువ నూనెతో వండటం, చిన్న భాగాలుగా తినడం, కొవ్వులను జాగ్రత్తగా సలెక్ట్ చేసుకోని తీసుకోవడం ద్వారా భారతీయ ఆహారాన్ని గుండెకు ఆరోగ్యకరంగా మార్చుకోవచ్చు. మంచి, చెడు కొవ్వుల తేడా తెలుసుకోవడం, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం, చురుకుగా ఉండటం వల్ల గుండె జబ్బులు రాకుండా నివారించవచ్చు. డాక్టర్ మాలిక్ చెప్పినట్లుగా కొలెస్ట్రాల్ చాలా అవసరం, కానీ జీవితంలో ప్రతిదానిలాగే బ్యాలెన్స్ ముఖ్యం. కాబట్టి భయం వద్దు, నియంత్రణే గుండె ఆరోగ్యానికి నిజమైన కీలకం అని గుర్తుంచుకోండి.